సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

వైభవుడికి విశేష సేవలు



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం విశేష సేవలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం నారాయణ సేవలో భాగంగా భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యులను సత్కరిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో త్రిదండి చిన్న జీయర్ స్వామి వారి వికాస తరంగిణి సహకారంతో ఆరోగ్య వికాస్ సంస్థ వైద్యులు శనివారం మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. గైనకాలజికల్ ఆంకాలజిస్టులు డాక్టర్ వి.ప్రియాంక, డాక్టర్ రేఖాపట్నాయక్ మహిళలకు పరీక్షలు చేశారు. బ్రెస్ట్ స్క్రీనింగ్, పాప్స్మియర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలిచ్చారు. మెగా వైద్య శిబిరంలో వంద మంది మహిళలు పరీక్షలు చేయించుకున్నారు. క్యాన్సర్ పరీక్షలు, గైనిక్ సమస్యలు.. వాటి పరిష్కార మార్గాలను వైద్యులు వివరించారు. క్యాల్షియం, మల్టీ విటమిన్, డీ-విటమిన్ పారాసెటమాల్, అవసరమైన యాంటీ బయోటిక్స్ టాబ్లెట్లు అందజేశారు. అనంతరం వైద్యులను క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి, ఉపాధ్యక్షురాలు పి.మహాలక్ష్మి, కార్యదర్శి జయ, ఇతర కార్యవర్గ సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.

క్విజ్ పోటీలో ఏఎంసీ విద్యార్థుల ప్రతిభ



వైద్య విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి

మహారాణిపేట: ఆంధ్రా మెడికల్ కాలేజీకి చెందిన సెకండియర్ పీజీ విద్యార్థినులు డాక్టర్ డి.రమ్య, డాక్టర్ ఎ.కాత్యాయిని నేషనల్ క్విజ్ పోటీలో విజేతలుగా నిలిచారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. క్విజ్ పోటీల్లో విజేతలుగా నిలవడం వైద్య విభాగానికి గర్వకారణమని ప్రిన్సిపాల్ కొనియాడారు. ఈ విజయంతో ఏఎంసీ, కేజీహెచ్‌కు మంచి పేరు తెచ్చారన్నారు. డాక్టర్ డి.రమ్య, డాక్టర్ ఎ.కాత్యాయిని అక్టోబర్ 25న జరగనున్న జోన్ స్థాయి పోటీలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

సిరులతల్లికి తులసి పూజ



తులసి పూజలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం ఉదయం తులసి పూజ, త్రికాల పంచామృతాభిషేక సేవ నిర్వహించారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొన దలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో రుసుం చెల్లించవచ్చన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రాజేంద్రకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న దీపాల సెట్

- మార్కెట్‌లో జోరుగా దీపావళి సామగ్రి విక్రయాలు
- ఆకట్టుకుంటున్న వెరైటీ ప్రమిదలు, దీపాలు
- నూనె అవసరం లేని దీపాల కొనుగోళ్లపై జనం ఆసక్తి



బ్యాటరీతో వెలిగే దీపాలు

దివాళీ.. శోభిల్లి

సీతంపేట: దీపావళి పండగ వస్తే ఊరంతా సందడే. ఆ రోజున ఇళ్లంతా దీపాల కాంతులతో నింపేస్తాం. ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మి ప్రవేశిస్తుందని పెద్దలు చెబుతుంటారు. అందుకే దీపావళి రోజు సాయంత్రం మహిళలు ఇంటి నిండా దీపాలు, క్యాండిళ్లు వెలిగించి మహాలక్ష్మికి పూజ చేసి స్వాగతం పలుకుతారు. ఈ నెల 20వ తేదీ సోమవారం దీపావళి పండగను ఘనంగా జరిపేందుకు అంతా సిద్ధమవుతున్నారు. మార్కెట్‌లో దివాళీ బాణసంచా సామగ్రి, వివిధ రకాల ప్రమిదలు, దీపాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

మట్టి ప్రమిదలే సంప్రదాయం

పూర్వం నుంచి మట్టి ప్రమిదల్లో ఒత్తులు, నూనె వేసి దీపాలు వెలిగించడం సంప్రదాయం. మట్టి ప్రమిదలకు మరిన్ని హంగులతో రంగులద్దిన దీపాలు మార్కెట్‌లో అందుబాటులోకి వచ్చాయి. సాదా ప్రమిదలతోపాటు వివిధ ఆకృతుల్లో మట్టి ప్రమిదలు లభిస్తున్నాయి. నక్షత్ర దీపాలు, పంచముఖ దీపాలు, దీప స్తంభాలు, ఆకాశ దీపాలు, చిమ్నీ దీపాలు, పింగాణీ దీపాలు ఇలా పలు రకాల మోడళ్లలో దీప ప్రమిదలు అక్కయ్యపాలెం, సీతంపేట, నరసింహనగర్, దొండపర్తి మొదలగు మార్కెట్లలో విక్రయిస్తున్నారు.

డిజైనర్ ప్రమిదలు.. డిఫరెంట్ క్యాండిళ్లు

మట్టి ప్రమిదలను వివిధ డిజైన్లలో రంగులతో



విక్రయానికి ఉంచిన డిజైనర్ దీపాలు



కుందన్స్‌తో డిజైన్ చేసిన దీప ప్రమిదలు

చూడముచ్చటగా అలంకరించి డిజైనర్ ప్రమిదలను కొంతమంది విక్రయిస్తున్నారు. కంపెనీలు తయారు చేసిన డిజైనర్ ప్రమిదలను కోల్‌కతా, చెన్నై నుంచి దిగుమతి చేసుకుని వ్యాపారులు, షాపింగ్ మాల్స్‌లో, రోడ్డు పక్కన దుకాణాలలో విక్రయిస్తున్నారు. వీటితో పాటు ఆకర్షణీయంగా పలు రకాల క్యాండిళ్లు, డెకరేటివ్ క్యాండిల్స్ గిఫ్ట్ ప్యాక్‌తో అందుబాటులోకి వచ్చాయి. ఫ్లోటింగ్ క్యాండిల్స్, సెంటెడ్ క్యాండిల్స్, వాటర్ క్యాండిల్స్, బ్యాటరీ క్యాండిల్స్, కుందన్ క్యాండిల్స్, జెల్



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో విక్రయిస్తున్న వివిధ రకాల మట్టి ప్రమిదలు

క్యాండిల్స్, క్యాండిల్ స్టాండ్స్ వివిధ రకాల్లో లభ్యమవుతున్నాయి. విద్యుత్‌తో వెలిగే దీపాల సీరియల్ దండలు ఆకర్షణీయమైన రూపాల్లో అక్కయ్యపాలెం పాలబూత్ సెంటర్, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, శంకరమఠం రోడ్, దొండపర్తి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

నీటితో వెలిగే దీపాలు

మారిన కాలానికి అనుగుణంగా నూనె లేకుండా నీటితో వెలిగే దీపాలు మార్కెట్‌లో వినియోగదారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. బ్యాటరీతో, కరెంట్‌తో అచ్చం నూనె దీపంలా వెలుగులు విరజిమ్మే దీపాలు దుకాణాల్లో విక్రయిస్తున్నారు. దీపాలు వెలిగించడానికి నూనె అక్కరలేదు. పొగ ఉండదు, గాలి వీస్తే ఆరిపోతుందన్న భయం లేదు. ప్రతి



ఏడాది వాడుకునే సౌలభ్యం ఉండటంతో బ్యాటరీ, విద్యుత్ దీపాలు, నీటి దీపాలు కొనుగోలు చేయడానికి మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు.

నిబంధనలు పాటించండి.. పోలీసులకు సహకరించండి



పోర్ట్ స్టేడియం వెనుక ఏర్పాటు చేసిన దీపావళి స్టాళ్లను పరిశీలిస్తున్న ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి

తాటిచెట్లపాలెం: దీపావళి బాణసంచా స్టాళ్ల నిర్వాహకులు నిబంధనలు పాటిస్తూ.. తమకు సహకరించాలని ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తి కోరారు. జీవీఎంసీ 14వ వార్డు పోర్ట్ స్టేడియం వెనుక వైపు ఏర్పాటు చేసిన దీపావళి స్టాళ్లను శనివారం ఆయన పరిశీలించారు. స్టాళ్ల నిర్వహణపై ఆరా తీశారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని, విక్రయాలకు సంబంధించి సమయపాలన పాటించాలని సూచించారు. ఏసీపీ వెంట ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ ఉమాకాంత్, సిబ్బంది ఉన్నారు.

టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి

ఆరిలోవ: ఆనందంగా జరుపుకునే దీపావళి సందర్భంగా టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు డాక్టర్ అర్పితా రెడ్డి, డాక్టర్ నికితా దాస్ సూచించారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శనివారం పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టపాసులు కాల్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. దీపావళిని సురక్షితంగా జరుపుకోవాలన్నారు. టపాసులు కాల్చినప్పుడు కళ్లజోడు పెట్టుకోవాలని, పిల్లలు టపాసులు కాల్చినప్పుడు పెద్దలు పర్యవేక్షించాలని, గ్యాస్ సిలిండర్లు, ఆయిల్ డబ్బాలు, మండే స్వభావమున్న పదార్థాలను దూరంగా ఉంచాలని సూచించారు. టపాసులను బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలన్నారు. ఒకవేళ టపాసులు కాల్చుతుండగా కళ్లకు ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే అందుబాటులో ఉండే కంటి వైద్యులను సంప్రదించాలని సూచించారు. కంటిని నలపకుండా సున్నితంగా శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో అత్యవసర సేవలు అందించడానికి 70950 31666, 93967 12020 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ముగిసిన మండల స్థాయి ఆటల పోటీలు



విజేతలను అభినందిస్తున్న ఎంఈవోలు రామారావు, బాలామణి



రన్నింగ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట: మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆటల పోటీలు అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్లో శనివారంతో దిగ్విజయంగా ముగిశాయి. స్కూల్ హెచ్ఎం జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను మండల స్థాయి ఇన్‌చార్జి వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.రత్నం, కె.జ్యోతి వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో పర్యవేక్షించారు. మండల స్థాయి పోటీల్లో విజేతలకు ఈ నెల 21, 22, 23 తేదీల్లో ఆనందపురం జిల్లా పరిషత్ పాఠశాలలో డివిజన్ స్థాయి పోటీలు జరుగుతాయని హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా మండల స్థాయి విజేతలను ఎంఈవోలు రామారావు, బాలామణి, పేరెంట్ కమిటీ అధ్యక్షుడు వంగల అప్పలరాజు అభినందించారు. పోటీల నిర్వహణకు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు స్వరూపరాణి, కవిత, సునీత, త్రినాథ్, నీరజ, శశిభూషణ్, అశోక్, సాయికుమార్, సంధ్య సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో సునీత, రమామణి, హేమ, అప్పారావు, కిషోర్, నిర్మల, వై.రామలక్ష్మి, పుష్పలత, గ్లోరీ, ఎన్‌సీసీ అధికారి ఎంఎస్‌వీ విశ్వనాథం, ఎస్.శ్రీనివాసరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో కాలుష్య నియంత్రణ



ఆరిలోవ రైతుబజార్‌లో శుభ్రం చేస్తున్న రైతులు, సిబ్బంది



విమ్స్ ఆవరణలో మొక్క నాటుతున్న డైరెక్టర్ రాంబాబు, వైద్యులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో పలుచోట్ల ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. ఆరిలోవ రైతు బజార్‌లో ఈవో నాయుడు, సిబ్బంది ఇక్కడ కాయగూరలు విక్రయించే రైతులతో కలిసి ఆవరణను శుభ్రం చేశారు. వారితో వినియోగదారులు కూడా చేయి కలిపారు. రైతు బజార్ ఆవరణలో పిచ్చి మొక్కలు తొలగించి, చీపుర్లతో తుడిచి శుభ్రం చేశారు.

- విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విమ్స్ ఆవరణలో డైరెక్టర్ డాక్టర్ రాంబాబు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆవరణలో పలుచోట్ల మొక్కలు నాటారు. అనంతరం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ కాలుష్య నివారణ కోసం మొక్కలు నాటాలని, వాహనాల వినియోగం నియంత్రించాలని సూచించారు. వ్యక్తిగత వాహనాలకు బదులుగా ప్రజా రవాణాను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కుమార్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న కృష్ణా కళాశాల అధ్యాపకులు

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో అధ్యాపకులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ అనుకూల కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. వాయు కాలుష్యాన్ని తగ్గించడానికి సైకిళ్లు, సౌరశక్తిని ఉపయోగించాలని సూచించారు.

ప్రభుత్వ రంగాన్ని బలహీనపరిచే చర్యలు విడనాడాలి

దాబాగార్డెన్స్: ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర బీజేపీ ప్రభుత్వం, బీజేపీకి మిత్రులుగా ఉన్న రాజకీయ పార్టీలు బలహీన పరిచే చర్యలు తక్షణం విడనాడాలని, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని సీపీఎం లోక్‌సభ ఫ్లోర్ లీడర్, దళిత సోషన్ ముక్తి మంచ్ అఖిల భారత అధ్యక్షుడు కె.రాధాకృష్ణన్ డిమాండ్ చేశారు. సీఐటీయూ అఖిల భారత 18వ మహాసభలు విశాఖలో డిసెంబర్ 31 నుంచి జనవరి 4 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో సిటు, కేవీపీఎస్ రాష్ట్ర కమిటీలు సంయుక్తంగా శనివారం దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో 'ప్రభుత్వ రంగం - సామాజిక న్యాయం' అనే అంశంపై సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థకు జీవనాడిగా పనిచేశాయన్నారు. ప్రైవేట్ రంగం ద్వారానే మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్న భ్రమలు నేడు తొలగిపోయాయన్నారు. కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తనకు నచ్చిన వారికి ప్రభుత్వరంగ సంస్థలు, సహజ వనరులు, దేశ సంపదను కట్టబెడుతోందని, ఈ విధానం తగదన్నారు. కార్యక్రమంలో సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి, డీఎస్ఎంఎం అఖిల భారత కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిటు రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, కార్యదర్శి కె.ధనలక్ష్మి, కేవీపీఎస్ నాయకులు కె.లోకనాథం, ఎం.సుబ్బన్న, టి.చిరంజీవి, వై.రాజు, సిటు జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాసరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ రాధాకృష్ణన్

చురుగ్గా కోటి సంతకాల సేకరణ

మద్రిపాలెం: కూటమి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని శనివారం 51వ వార్డులో నిర్వహించారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ వార్డు నాయకులతో కలిసి అంబేడ్కర్ కాలనీ, రామన్న కాలనీల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. వైద్య కళాశాలలను ప్రైవేట్ పరం చేయడం వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తే కేవలం కొందరికే వైద్య విద్య పరిమితమవుతుందని కార్పొరేటర్ అన్నారు. ఈ అన్యాయాన్ని నిలదీయడానికి, భవిష్యత్తును కాపాడుకోవడానికి కోటి సంతకాల సేకరణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పొన్నాడ అప్పారావు, బుడుమూరు తిరుమలరావు, మెట్ట దమయంతి, రాణి, లక్ష్మణ్, సారిక, నూకరాజు, కొండలరావు, వరహాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా వైద్య విద్య

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో శనివారం కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అయినింటి రవికుమార్, వివిధ విభాగాల స్థానిక నాయకులతో కలిసి ఆయన 25వ పోలింగ్ బూత్ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వల్ల ప్రజలకు జరిగే



రామన్న కాలనీలో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

నష్టాలను అల్లు శంకరరావు స్థానికులకు వివరించారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు వైద్య విద్య అందని ద్రాక్షగా మారుతుందన్నారు. ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా విద్యార్థి విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ పల్లా చైతన్య, వార్డు సెక్రటరీలు ఆర్.వెంకటరావు, జెడ ప్రశాంత్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు రీసు చిన్నారావు, బీసీ సెల్ అధ్యక్షుడు కోన ఢిల్లీరావు, యువజన విభాగం అధ్యక్షుడు ఇగలపాటి రాజేష్, విద్యార్థి విభాగం అధ్యక్షుడు సురపల్లి ఆనంద్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు గల్ల రాంబాబు, మున్సిపాలిటీ వింగ్ అధ్యక్షుడు లంక వెంకట సుధాకర్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షులు సోమరపాటి కనకమహాలక్ష్మి, సీనియర్ నాయకులు ఎస్.రాజు, ఎస్ హైమ, బి.దుర్గ పాల్గొన్నారు.

45వ వార్డులో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో శనివారం కోటి సంతకాల సేకరణ ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో వార్డులోని తాటిచెట్లపాలెం బజార్, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు హరి పట్నాయక్, సతీష్, లాయర్ చిన్నారావు, పైడి నాగరాజు, నాయుడు, గణపతి, సన్నీ, రవిశంకర్, హరి, వేణు, కాయల నర్సింగ్, ఈశ్వరరావు, భరత్, సురేష్, నాగరాజు, అప్పారావు, సువర్ణ, తవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



49వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు, పార్టీ నాయకులు



45వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న పైడి రమణ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖ-లీగల్: పేద, అణగారిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయాన్ని మరింత సమర్థవంతంగా అందించి, న్యాయ సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లతో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్ కేసుల పరిష్కారం, న్యాయ సేవా పథకాల అమలు, గ్రామ స్థాయి వరకు న్యాయ సహాయాన్ని చేరవేయడంలో అందరి సహకారం కావాలన్నారు. ప్యానెల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

'సెయింట్ జోసెఫ్'లో తిజారా ఫెస్ట్ సందడి



తిజారా ఫెస్ట్ వేడుకల్లో అతిథులు, అధ్యాపకులతో విద్యార్థినులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో కామర్స్-మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎన్. జ్యోతి ఆధ్వర్యంలో తిజారా ఫెస్ట్-2025 వేడుకలు సందడి వాతావరణంలో జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి వేడుకలను ప్రారంభించారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ నిపుణులు విద్యార్థులకు ఆర్థిక రంగం, మార్కెట్లపై అవగాహన కల్పించారు. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కెప్టెన్ కె.సుజాత విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎం.జగదీష్‌కుమార్, ఆర్. పావని, కె.ప్రత్యూష, డాక్టర్ కె.రజని, డాక్టర్ దివ్య జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి వర్క్‌షాప్

మద్దిలపాలెం : ఆంధ్ర విశ్వవిద్యాలయం మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న వర్క్‌షాప్‌నకు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రీయ ఉచ్చత శిక్ష అభియాన్ సహకారంతో మ్యాథమెటిక్స్ విభాగం ఆధ్వర్యంలో క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్ ప్రోటోకాల్స్ అండ్ క్రిప్టోగ్రఫీ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. క్వాంటమ్ టెక్నాలజీస్‌పై ప్రాథమిక అవగాహన కల్పించడం వర్క్‌షాప్ ఉద్దేశమని వీసీ రాజశేఖర్ తెలిపారు.

నిరాశ్రయులకు ఆశ్రయం



రెస్క్యూ చేసిన నిరాశ్రయులతో ఏయూటీడీ నిర్వాహకులు

అల్లిపురం: నవంబర్ 14, 15 తేదీల్లో జరగబోయే పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌ను దృష్టిలో పెట్టుకుని ఏయూటీడీ-జీవీఎంసీ షెల్టర్ల సిబ్బంది స్పెషల్ డ్రైవ్ ద్వారా రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాల్లో శనివారం నిరాశ్రయుల గుర్తింపు, షెల్టర్లకు తరలించే కార్యక్రమం చేపట్టారు. గుర్తు తెలియని దివ్యాంగుడు(45), సాలిపేటకు చెందిన ఎస్.దేవరాజు(66), ఎగిలిపాటి గణేష్(50), శాంతారావు(45), నిమ్మాడకు చెందిన ఒక మహిళ(55)ను రైల్వే పోలీసులతో కలిసి టీఎస్ఆర్ షెల్టర్‌లో పునరావాసం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. మానసిక స్థితి బాగోలేని మహిళకు శ్రద్ధా ఫౌండేషన్ ద్వారా వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. రెస్క్యూలో ప్రగడ వాసు, జ్యోతిర్మయి, శ్రీను, లీల, శాంతి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ నార్త్
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com